ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 11.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఎల్ నినో ప్రభావంతో నీరు, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

2. హైదరాబాద్ లో నషా ముక్త్ భారత్ – సైక్లింగ్ ర్యాలీ లో రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

3. మహిళల హక్కులు , ఆత్మగౌరవం, స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

4. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలలో భాగంగా , ఈరోజు సాయంత్రం అటుకల బతుకమ్మకు మహిళలు పూజలు చేయనున్నారు.

**రేవంత్ రెడ్డి**

ఎల్‌నినో ప్రభావంతో ఎదురవుతున్న పరిస్థితులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న కీలక సమీక్ష చేశారు. సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రానున్న 8 నెలలు అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్‌నినోపై వార్‌రూం , టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముమ్ముందు విద్యుత్ సమస్య తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని , కానీ మార్కెట్‌లో తగిన విద్యుత్ అందుబాటులో లేదన్నారు.

అందుబాటులో ఉన్న విద్యుత్‌నే పొదుపుగా వాడుకోవాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండడంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన రేవంత్ రెడ్డి... తాగు , సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక అమలులో ప్రజలనూ భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు.

డెస్క్

**యాంటీ డ్రగ్స్ సైకిల్ ర్యాలీ**

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం , మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా అక్షర స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నషా ముక్త్ భారత్ – సైక్లింగ్ రైడ్ జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు. సీతారాంపేటలోని బాల హనుమాన్ మందిరం నుంచి అసెంబ్లీ ప్రాంగణంలోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహం వరకు నిర్వహించిన ఈ సైక్లింగ్ రైడ్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించారు.

డెస్క్

**ఉమెన్ బైక్ ర్యాలీ**

అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. షీ పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్‌లో మహిళా భద్రత బైక్ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని పీవీ మార్గ్ వద్ద ఈ ర్యాలీని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి జూపల్లి కృష్ణారావు , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. జలవిహార్ నుంచి ట్యాంక్‌బండ్ చుట్టూ బైక్ ర్యాలీ జరిగింది. మహిళల భద్రత , రహదారి ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూ మహిళా సూపర్ బైకర్లు , స్కూటీ రైడర్లు , సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మహిళల

భద్రత, హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అన్నారు. మహిళలు తమ కలలను సాకారం చేసుకునేందుకు , బాలికలు విద్యను అభ్యసించేందుకు, అన్ని రంగాల్లో ఎదిగేందుకు సమాన అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు మహిళలను గౌరవించే విలువలను కుటుంబ సభ్యులే నేర్పించాలని సూచించారు.

డెస్క్

**BATHUKAMMAFESTIVAL**
తెలంగాణ సంస్కృతి , సంప్రదాయాలకు ప్రతీక అయిన పూల పండుగ బతుకమ్మ ఘనంగా ప్రారంభమైంది. నిన్న ఎంగిలిపూల బతుకమ్మతో బతుకమ్మ సంబురాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్నాయి. తంగేడు , గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలను మహిళలు అందంగా గుమ్మట ఆకారంలో అమర్చి.... బతుకమ్మ పైన పసుపుతో చేసిన గౌరమ్మ ప్రతిమను ప్రతిష్టించి ఈ తొమ్మిది రోజులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ప్రతిరోజు సాయంత్రం మహిళలు , యువతులు బతుకమ్మ చుట్టూ చేరి , చప్పట్లతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యం చేస్తారు. వేడుక ముగింపులో బతుకమ్మను సమీపంలోని చెరువులో లేదా కుంటలో నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకల్లో ప్రతి రోజుకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన ఈ సంబురాల్లో రెండవ రోజయిన నేడు అటుకుల బతుకమ్మ నిర్వహిస్తారు.

GS

**గవర్నర్ శుభాకాంక్షలు**

9 రోజుల పాటు జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి తొమ్మిది రూపాలను తొమ్మిది రోజుల పాటు ఆరాధించే నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా

శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్రం , ప్రజలు సుభిక్షంగా ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు. శక్తి స్వరూపిణి దుర్గాదేవి దివ్యానుగ్రహంతో ప్రజలందరికీ శక్తి , ధైర్యం, శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు చేకూరాలని శివప్రతాప్ శుక్లా ఆకాంక్షించారు.

డెస్క్

**పొన్నం ప్రభాకర్**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు హైదరాబాద్ లో ఘనంగా ప్రారంభమయ్యాయి. బల్కంపేటలో వెలిసిన రేణుక ఎల్లమ్మ పోచమ్మ ఆలయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల తొలి రోజు శ్రీ బాలా త్రిపురసుందరి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనం ఇస్తున్నారు. దీపాలతో సుందరంగా అలంకరించిన అమ్మవారిని మంత్రి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని , రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో , సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.

డెస్క్

**రవీంద్ర భారతి బతుకమ్మ**

బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో నిన్న అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ప్రారంభ వేడుకలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు , పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు. సంప్రదాయ పాటలు పాడారు. బతుకమ్మ ఆటపాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి , కష్టసుఖాలను కలిసి

పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని జూపల్లి కృష్ణారావు , పొన్నం ప్రభాకర్ అన్నారు.

డెస్క్

**బండి సంజయ్**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. కరీంనగర్, హుజురాబాద్, చొప్పదండి, జమ్మికుంట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో మహిళలు అందంగా ముస్తాబయి బతుకమ్మలను అలంకరించి ఒక చోట చేర్చి ఆడిపాడారు. కరీంనగర్ లోని మహా శక్తి ఆలయంలో జరిగిన బతుకమ్మ వేడుకలలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, అపర్ణ దంపతులు పాల్గొన్నారు.

పిటిసి, కరీంనగర్

**KTR**

సిరిసిల్ల జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 2021 సంవత్సరంలో 402 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతులు మంజూరైనా... సిరిసిల్ల జేఎన్టీయూ శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటివరకు జరగలేదని లేఖలో ప్రస్తావించారు. మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించినప్పటికీ పనులు పెండింగ్ లో ఉండటంతో ప్రస్తుతం అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జేఎన్టీయూ తాత్కాలికంగా కొనసాగుతోందని తెలిపారు. మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రికి కల్వకుంట్ల తారక రామారావు విజ్ఞప్తి చేశారు. కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పీటీసీ రాజన్న సిరిసిల్ల

**పొంగులేటి**

తెలంగాణ క్రీడాకారులు జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అత్యుత్తమ శిక్షణ అందివ్వడంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పిస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్- 20 బాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు.

పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

**ట్రిపుల్ తలాఖ్ VOCIE CAST**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాతికేళ్ల పాలనా ప్రస్థానంపై అన్ని వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి. నరేంద్రమోదీ జన సేవ ద్వారా దేశ సేవ అనే మంత్రంతో సమాజంలో ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం , భద్రత అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మోడీ నాయకత్వంలో...సేవా , సుపరిపాలనల మార్గదర్శకత్వంలో కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 'వికసిత్ భారత్ ' సాధించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ముస్లిం మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటం, వారికి రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించడంలో ట్రిబుల్ తలాఖ్ రద్దు చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. సమ్మిళిత అభివృద్ధి , మహిళా సాధికారత ద్వారా ప్రజల జీవితాల్లో తెచ్చిన ఆశించిన మార్పును ఈ ప్రత్యేక కథనంలో తెలుసుకుందాం.

**VOICE CAST**

ట్రిబుల్ తలాఖ్ ఆచారాన్ని రద్దు చేయడం దేశంలోని కోట్లాది ముస్లిం మహిళల దశాబ్దాల నిరీక్షణకు, ఆత్మగౌరవ పోరాటానికి లభించిన విజయంగా అభివర్ణిస్తున్నారు. మహిళల ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తూ ఈ అన్యాయమైన పద్ధతికి స్వస్తి పలకడం సమాజ పురోగతికి ప్రతీకగా భావిస్తున్నారు. ప్రతి మహిళా స్వేచ్ఛగా , గౌరవంగా జీవించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. దేశంలో మహిళా సాధికారతకు బాటలు వేసిన ఈ చారిత్రక నిర్ణయం పట్ల హైదరాబాద్ కు చెందిన ఫర్హీన్ బేగం తమ అభిప్రాయాన్ని ఆకాశవాణితో పంచుకున్నారు.

BYTE

RNU, HYD

**అడవుల్లో మారథాన్**

మంచిర్యాల జిల్లా అడవుల్లో జాతీయ స్థాయి మారథాన్ నిర్వహించారు. మంచిర్యాల జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు , జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో హాజీపూర్ , మందమర్రి మండలాల అటవీ ప్రాంతంలో ఈరోజు జాతీయ స్థాయి మారథాన్ నిర్వహించారు. ఈ పరుగులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులతో పాటు ఇతర దేశాలకు చెందిన నలుగురు సహా సుమారు 400 మంది పాల్గొన్నారు.

**BYTE ... RAHUL KISHAN JADAV**

పీటీసీ మంచిర్యాల